క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు మూసారాంబాగ్, జ్ఞాన్‌దీప్ టవర్, కృష్ణతులసీ నగర్, అండాళ్ నిలయం, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, ఎస్‌బీహెచ్ బ్యాంక్, ఇంద్రానగర్, రాజరాజేశ్వరీ టెంపుల్, ఎస్‌బీఐ కాలనీ పార్క్, డీబీఆర్ డయాగ్నస్టిక్ సెంటర్, నోబుల్ డిగ్రీ కాలేజీ పరిసరాలు...

◆ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, ఇందిరా నగర్, ఎస్ఆర్ఎం కాలేజ్ ఏరియా, దిల్‌సుఖ్ నగర్ డిపో, లక్ష్మీ మోటార్స్, విజయ డయాగ్నస్టిక్ సెంటర్, మారుతీ మందిర్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్ రోడ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ వివరించారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 17, వంకాయ 23, బెండ 32, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 35, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 40, దొండ 23, ఆలు 20, ఉల్లి 14, గోకర 45, దోస 13, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 65, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 51, బీట్‌రూట్ 33, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 70, కాప్సికమ్ 55. బుధవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మద్ది ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కుమార్ బొకే అందజేస్తున్న జ్యోత్స్న

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా మద్ది ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన జ్యోత్స్న భరోసా సెంటర్‌కు బదిలీ కావడంతో టాస్క్‌ఫోర్స్ విభాగంలో అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ ఆమె స్థానంలో బదిలీపై మలక్‌పేట వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ మొట్టమొదట మాడ్గుల పీఎస్‌లో పోస్టింగ్ తీసుకున్నారు. గద్వాల గట్టు పోలీస్‌స్టేషన్, ఎస్ఐబీ విభాగం, అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో డీఐగా, కమాండ్ కంట్రోల్, ఐటీ సెల్ విభాగాలలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భద్రత, సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆదర్శ డివిజన్‌గా బీఎన్‌రెడ్డి నగర్



వరదనీటి కాల్వ పనులపై ఏఈతో చర్చిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఏఈ నాగరాజుతో కలిసి కాలనీలో వరదనీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...వరదనీటి కాలువ ఏర్పాటుతో లోతట్టు కాలనీల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత కాలనీవాసులపై ఉందన్నారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-1 నూతన కార్యవర్గం ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ సంక్షేమ సంఘం ఫేజ్-1 అధ్యక్షుడిగా వెదిరే యోగేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో కాలనీ వాసులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సాతినేని రాంరెడ్డి, కోశాధికారిగా నాగయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు యోగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాలనీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పార్కు సమస్యలను పరిష్కరిస్తానని, కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

వార్డు కార్యాలయం మాకొద్దు

ఇంద్రప్రస్థకాలనీ వాసుల నిరసన



కమ్యూనిటీ హాల్ గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయ వద్దని కోరుతూ మంగళవారం కాలనీ వాసులు, మహిళలు గేటు కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలోకి వెళుతున్న పట్టణ ప్రణాళికా విభాగం, పారిశుద్ధ్య విభాగం అధికారులను అడ్డుకున్నారు. 2016లో జీహెచ్ఎంసీ వార్డు పునర్విభజనలో భాగంగా ఏర్పడిన హస్తినాపురం డివిజన్‌కు పూర్తిస్థాయి వార్డు కార్యాలయం లేకపోవడంతో ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్-2లోని కమ్యూనిటీ హాల్‌పై అంతస్తులో తాత్కాలికంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పాలన కొనసాగిస్తున్నారు. ఇటీవల డివిజన్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా డివిజన్ల పరిధిలో వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంద్రప్రస్థ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో తాత్కాలికంగా కొనసాగుతున్న కార్యాలయాన్నే వార్డు కార్యాలయంగా కొనసాగించాలనే ఉద్దేశంతో అధికారులు సన్నాహాలు చేపట్టారు. దీనిపై సమాచారం అందడంతో కాలనీ వాసులు అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకున్నారు. కమ్యూనిటీ హాల్‌లో వార్డు కార్యాలయం ఏర్పాటు చేస్తే పండుగలు, శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు వార్డు కార్యాలయంలోకి వెళ్లకుండా మహిళలు వారిని అడ్డుకున్నారు. వార్డు కార్యాలయం ఏర్పాటుతో ప్రజలు సమస్యలను పరిష్కరించడంలో సులువు అవుతుందని అధికారులు నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు.

ఓటర్ల నమోదు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ కమిషనర్ జయంత్ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గ పరిధిలో రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో మలక్‌పేట సిమ్లా గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన కొందరు ఓటర్ల పేర్లు ఒక బూత్‌లో ఉండగా మరికొందరివి మరో బూత్‌లో నమోదు కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో ఓటరు కార్డులు డౌన్‌లోడ్ కావడం లేదన్నారు. షిఫ్టింగ్ పేరుతో కొందరు ఓటర్లను లిస్టు నుండి తొలగిస్తున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. డీసీ జయంత్ మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు తలలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నాయకులు బొక్క మధుసూధన్‌రెడ్డి, గూడూరు యాదిరెడ్డి, నవీన్‌రెడ్డి, అబ్రార్, హాజీ, ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

సైదాబాద్: మలక్‌పేట బీ బ్లాక్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గా బచ్చు గంగాధర్ ఎన్నికయ్యారు. దేవాలయ మాజీ చైర్మన్ గూండా మల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా పాల మధుసూధన్, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా డాక్టర్ ఎస్.విజయ్‌భాస్కర్, కోశాధికారిగా పి.శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు దేవాలయ ట్రస్టీలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు

దిల్‌సుఖ్‌నగర్: వేసవి నేపథ్యంలో డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని మార్గదర్శికా లనీ, ఎన్టీఆర్‌నగర్ తదితర కాలనీల్లో పర్యటించారు. కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరా సరిగ్గా జరుగక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో అదనపు వాల్వ్‌లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు



జలమండలి అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్

నాగోలు: డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం తన నివాసంలో జలమండలి అధికారులతో ఏర్పాటు చేసిఒన సమావేశంలో డ్రైనేజీ, నీటి సరఫరా తదితర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలు జరుగుతున్నాయని తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని జలమండలి జీఎం వినోద్ కుమార్, మేనేజర్ మాధవి జలమండలి మేనేజర్ అలేఖ్య, అర్చనను ఆదేశించారు. డివిజన్ పరిధిలో వాటర్ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు కోరారు. వర్షాకాలంలో కాలనీ వాసులకు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లో పర్యటించిన ఆమె కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాలివాహననగర్ మాక్సివిజన్ లైన్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి రెండు రోజులుగా మురుగునీరు రోడ్డుపై పారుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా సీవరేజ్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులకు నిర్లక్ష్యం వహించరదన్నారు. కాలనీలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు యాదగిరి, షకీల్, జీహెచ్ఎంసీ సత్తిరెడ్డి, కాలనీవాసులు రామకృష్ణ, కృష్ణమూర్తి, నాయకులు దినేష్, పరుశురామ్, మల్లేష్ పాల్గొన్నారు.

మార్కెట్ గార్బేజీ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసులు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ గార్బేజీ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మంగళవారం మార్కెట్ అధికారులు తెలిపారు. నెల రోజులుగా మార్కెట్‌లోని చెత్త లిఫ్టింగ్‌లో అలసత్వం వహించడంతో ఇప్పటికే మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. త్వరలో కాంట్రాక్ట్ రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

గార్బేజీ లిఫ్టింగ్‌కు నెలకు రూ.3.25 లక్షలు

గార్బేజీ లిఫ్టింగ్ నిమిత్తం రూ. 3.25 లక్షలు మార్కెట్ కమిటీ చెల్లిస్తుండగా సదరు కాంట్రాక్టర్ మార్కెట్ ప్రాంగణాన్ని శుభ్రం చేయడం లేదని పలువురు వ్యాపారులు, రైతులు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లల భవిష్యత్ కోసం భూములు ఇస్తున్నాం

బోడుప్పల్: రేపటితరం పిల్లల భవిష్యత్ కోసం తమ భూములను ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు బోడుప్పల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిన్నింగల్ల కుమార్, కార్పొరేటర్ చీరాల నర్సింహ, సలహాదారులు మీసాల కృష్ణ వెల్లడించారు. బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బోడుప్పల్ పెద్దకంచెలో 61 మంది దళిత కుటుంబాలకు 336 ఎకరాల భూమి ఉందని, అందులో 43 మంది దళిత రైతులు తమ 234 ఎకరాలను భూమిని ల్యాండ్ పూలింగ్ కింద హెచ్ఎండీఏకి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఎకరానికి 600 గజాల చొప్పున తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డిగానీ బలవంతంగా, భయపెట్టి తీసుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మా ఇష్ట పూర్వకంగా ప్రభుత్వానికి ఇచ్చేందుకు లిఖిత పూర్వకంగా ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. కొంతమంది మధ్యవర్తులకు లాభం లేకపోవడంతో అడ్డుపడుతున్నారన్నారు. 43 మంది కుటుంబాల జీవితాలు బాగుపడాలనే ఉద్దేశ్యంతో భూములు ఇస్తున్నామని, మా పిల్లలు ఇప్పటికీ నగర పాలక సంస్థలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. 43 కుటుంబాలకు చెందిన వారు ల్యాండ్ పూలింగ్ కింద తమ భూములు ఇచ్చేందుకు సిద్ధమని వారు వెల్లడించారు. బోడుప్పల్ అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు దానగల్ల యాదగిరి, పంటి కిషన్, రాపోలు రామస్వామి, రాపోలు శంకరయ్య, రాపోలు నారాయణ, ఉపాధ్యక్షుడు చంటి శ్రీనివాస్, ప్రతినిధులు మీసాల యాదగిరి, మైసగల్ల మల్లేష్, విజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న సదానందరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ఈనెల 24న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కులోని ధర్నా చౌక్ వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న నిర్వహించే నిరాహార దీక్షకు విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్య వైద్య సాధన సమితి అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్, నర్సింహాగౌడ్, వెంకటేశ్వర్, ధానమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. మంగవారం వీఏపీ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్, మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో చిలుకానగర్ డివిజన్‌పరిధిలోని కళ్యాణపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. వీఏపీ హ్యూమన్ రైట్స్ వారు పేద ప్రజల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఒబైద్, స్థానికులు బజార్ జగన్, ఎద్దుల కొండల్ రెడ్డి, జావీద్, ఖాజా, మొహీనుద్దీన్, బింగి శ్రీనివాస్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

జూన్ నెలాఖరులోగా టన్నెల్ పనులు పూర్తి చేయాలి



టన్నెల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మూడో టన్నెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. జూన్ నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముంపు నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రియదర్శిని పార్కు మసీదు సమీపంలో ముడు గేట్లు ఏర్పాటు చేశామని, చెరువు నీటి మట్టం అవసరమైతే పెంచుకోవటం, తగ్గించుకునేందుకు వీలుగా ఈ గేట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. టన్నెల్ నిర్మాణ పనులు నాలుగు నెలలుగా నత్తనడకన నడుస్తున్నాయని, అంచనాలకు మించి అయ్యే వ్యయాన్ని కూడా కాంట్రాక్టర్‌కు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న మూడో టన్నెల్ ద్వారా త్వరగా నీటిని బయటకు పంపేందుకు అవకాశం ఉంటుందన్నారు. చైతన్యపురి నాలా వద్ద మూసేసిన మూడు కల్వర్టులను తెరిపించామని, పనులు పూర్తయితే వరద సమస్య ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వనస్థలిపురం తూర్పు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు



కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వనస్థలిపురం తూర్పు 21 కాలనీలకు సంబంధించి ఈస్టర్న్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గుత్తా లక్ష్మణ్‌రెడ్డిలను ఆయా కాలనీలకు చెందిన కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు ఎన్నుకున్నారు. మంగళవారం రాజప్పనగర్ కాలనీలో జరిగిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు



సీఐటీయూ శిక్షణా తరగతుల్లో పాల్గొన్న కార్యకర్తలు

చైతన్యపురి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మల్లెపాక వీరయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చైతన్యపురిలోని బోడేపూడి వెంకటేశ్వర భవనంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. మేకల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ శక్తులు కార్మికవర్గ ఐక్యతను పక్కదారి పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మటం, ఎల్ఐసీ, బ్యాంకింగ్ రంగ ఆర్థిక సంస్థలను బలహీన పరుస్తుందని, రైల్వే, బొగ్గు బావులు, టెలికం, విద్యుత్, నేషనల్ హైవేలు, పెట్రోలియం సంస్థల వాటా, ఆస్తులను తాకట్టు పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలను చైతన్యం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి చైతన్య, సరూర్‌నగర్ లేబర్ అడ్డా అధ్యక్షుడు సీహెచ్ నవీన్, నాయకులు కే.యశోద, నరసింహ, బిక్షపతి, ఎస్ లింగయ్య, నాగమణి, ఉప్పలమ్మ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మహా వీరుడు రాణా ప్రతాప్ సింగ్



రాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: మొఘల్ సామ్రాజ్య విస్తరణను అడ్డుకున్న మహా వీరుడు మహారాణా ప్రతాప్ అని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి కొత్తపేట డివిజన్ రాఘవేంద్ర కాలనీలో మహా రాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ రాణా ప్రతాప్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిసోడియా రాజవంశానికి చెందిన రాణా ప్రతాప్ సింగ్ మొఘల్ సామ్రాజ్య విస్తరణను తీవ్రంగా ప్రతిఘటించాడన్నారు. 1576లో జరిగిన హల్దీఘాట్ యుద్ధంతో సహా అక్బర్‌కు వ్యతిరేకంగా ఎన్నో యుద్ధాలు చేశాడని కొనియాడారు. చిత్తోడ్‌కు స్వాతంత్ర్యం సిద్ధించే వరకు బంగారు పళ్లెంలో భోజనం చేయనని, రాజ ప్రసాదంలో నిద్రించనని ప్రకటించిన నాయకుడని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఠాకూర్ హరినాథ్ సింగ్, నరేందర్ సింగ్, రూప దేవి, రిషికాంత్ సింగ్, ఉపేందర్ సింగ్, కొత్త తిరుమల, సత్య నారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలి



మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

సుల్తాన్‌బజార్: న్యాయవాదులపై దాడుల నివారణకు న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని బార్‌కౌన్సిల్ సభ్యులు కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భారత ప్రజా న్యాయవాదుల సంస్థ, లాయర్స్ కౌన్సిల్ పౌరహక్కుల సంఘం, పీయూసీఎల్, బార్‌కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ఇటీవల నల్గొండ జిల్లా తిరుమలగిరిలో యువ న్యాయవాది యుగేందర్‌పై స్థానిక ఎమ్మెల్యే అనుచరులు దాడిచేశారని ఆరోపించారు. అలాగే మరో ఘటనలో చర్లపల్లి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ అనే జైలర్ న్యాయవాది డి.సురేష్‌కుమార్‌పై నిందపూర్వకంగా పత్రికా ప్రకటన ఇవ్వడాన్ని ఆయా సంఘాల నాయకులు ఖండించారు. ఈ సమావేశంలో సైదారావు, ఉపాధ్యక్షుడు వెంకన్న, నారాయణరావు, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. వైద్య విధాన పరిషత్ యాకుత్‌పురా-1 యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం రెయిన్‌బజార్ మదీనానగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులకు సాధారణ చికిత్సలతో పాటు కంటి, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ఆరోగ్య సమస్యలు రాకుండా జగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గంలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు వైద్యశాఖ అధికారులతో చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఆయేషా ముద్దాషీర్, డాక్టర్ షాఫీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీఎం కప్

హుడాకాంప్లెక్స్: సీఎం కప్-2023లో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం రెండో రోజు ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయి అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో మండలాల నుంచి ఎంపికైన 500 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 24న వాలీబాల్ పురుషుల విభాగంలో గండిపేట-ఫారూఖ్‌నగర్, మహిళల విభాగంలో యాచారం -తలకొండపల్లి, కబడ్డీ పురుషుల విభాగంలో సరూర్‌నగర్-బాలాపూర్, ఖోఖో పురుషుల విభాగంలో యాచారం-హయత్‌నగర్, ఖోఖో మహిళా విభాగంలో సరూర్‌నగర్-హయత్‌నగర్ గ్రూపులకు బుధవారం సాయంత్రం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.